"ముదితల్ నేర్వఁగరాని విద్యగలదే, ముద్దార నేర్పించినన్!"

# తత్త్వమసి

(కథానిక)

వై. యం. శర్మ

"నీ ప్రాణమెక్కడ దాచావోయి మాయల మరాఠీ?"

"నీ ముచ్చుజల్లో కళ్ళలోనోయ్ రాజకుమారీ!"

పడి చస్తుంది అరుణ నేనంటే! చిన్నతనం నుంచీ ఒకచోటే పెరగడంవల్ల ఒకళ్లనొకళ్లం ఏమో యంటే ఏమో యని పిలుచుకుంటూ ఎంతో అన్యోన్యంగా వుండేవాళ్ల మిద్దరమూనూ. అరుణ నన్ను స్వయం వరించింది అని చెప్పటంలో అతిశయోక్తి "అయోటా"అంత కూడా లేదు! క్షమించాలి మరి. విషయం బోధపడటానికని యథార్థం చెబుతున్నాను: చిన్నతనం నుంచీ ఎన్నడూ మందకొడిగా ఉండి యెరగను. తోటిపిల్లలు అమాయికంగా ఆడుకుంటుంటే వాడి బంతికోసం వీణ్ణీ వీడి బంతికోసం వాణ్ణీ ఉసికొలిపితే అవి రెండూ నాకు వొదిలేసి కీచులాడుకునేవాళ్లు, మరి చూడండి, అలాంటి మూర్ఖుల్ని ఎలా పెళ్ళాడుతుంది అరుణ?

నాకు మంత్రిపని చేసే యోగమున్నదని యేనాడో గుర్తించింది మా బామ్మ! ఆమె ఆశీర్వచనం అమోఘం! డిగ్రీ పుచ్చుకుని నెల తిరిగే లోపుగానే సెక్రటేరియట్‌లో గుమాస్తాగా చేరాను. చాలదూ మొదటిమెట్టుకు? డబ్బు కూడా ఎంత పొదుపుగా వాడుతానో అరుణ నడగండి చెబుతుంది. ఆరేళ్ల సర్వీసులో అప్పరు డివిజను క్లర్కునై ఆరుగదుల యిల్లు కట్టి అరుణకు ఐదుపేటల గొలుసూ, వడ్డాణం చేయించటమే కాక ఏటా ఓ మైసూరు సిల్కుచీర కొనటమంటే మాటలా మరి! అందులోనూ ఎన్నడూ కానీకి కక్కుర్తిపడి యెరగనని ప్రమాణం చేసి చెబుతున్నాను!

ఎటొచ్చీ శంకర్రావొక్కడే కంటికి తగిలే పుల్ల! తన సంగతి తాను చూసుకోకూడదూ? లోకోద్ధరణకు కంకణం కట్టుకున్నాడు హరిశ్చంద్రుడు! ఏదన్నా కాగితం కొంచెము ఆలస్యమైతే చాలు అది ఎక్కడవున్నదీ ఎన్నాళ్ళనించీ పడివున్నదీ ఎందుకు వున్నదీ ఆరాలుతీసి ఆఫీసరుకు నోటు పుటప్ చేస్తాడు! ఖర్మగాలి ఎవడన్నా గడ్డి తిన్నాడా చచ్చాడే! నాకేమిటి మా ఆఫీసు వాళ్లకందరికీ ఏకగ్రీవంగా ఒళ్లు మండుతుందంటే ఎందుకు మండదు? మనిషన్న తరవాత మంచీ చెడ్డా ఎవరికన్నా వుంటుంది. అంతమాత్రాన కొంప లంటుకు పోయినట్టు రిపోర్టు చేస్తే ఇహ మనకు కట్టే ముంటుంది? చెప్పాలంటే తనమీద మటుకు లేవూ? సవాలక్ష వుంటై! ఉండకపోతే మటుకు కలిపించ లేమూ? ...ఆహాఁ, సంగతి జెబుతా, తనకెందుకంట ఎవరెట్లా ఏడిచేదిని? ఆఫీసరు గుడ్ బుక్స్‌లో వున్నామని తెగనీలుగు! అసలా ఆఫీసర్లో వుందిలెండి కుళ్లంతానూ, అతన్ననే దేమిటి? ఇంత సీనియారిటీ తగలబడ్డ మమ్మల్ని ఏమీ ఖాతరు చెయ్యకుండా చూస్తూనే చిర్రు బుస్సు మనేవాడు. నిన్నగాక మొన్న వచ్చినవణ్ణి పిలిచి అలా చెవులు కొరికించుకోవటమేం? నిలవ నీడలేక యిదౌతుంటే పిలిచి యిల్లిచ్చిన విశ్వాసమన్నా వుండక్కర్లా? ఇమీడియేట్ సుపీరియర్ గదా అని చవగ్గా యాభైకిచ్చాను గానీ ఎక్కడ దొరుకుతుందో చూడండి యీ ట్రిప్లికేన్‌లో ఇంత చౌకలో రెండు గదుల మేడభాగం!

డ్యూటీట డ్యూటీ! ఎవడి కొంపవాయ్యా నీడ్యూటీ వలుగుర్ని మెప్పించలేక పోయినాక? మినిష్టరుకు రిపోర్టులు పోయినాయ్యంటే పోవూ కడుపు మండుతుంటే? మరీ అంత కాల్చుకు తినటమా? ఏదో పర్మిట్లకని అడ్డమైనవాళ్లు కాళ్లా పట్టుకుని రికమెండేషన్లు తీసుకుని అంతంత దూరాన్నించి పనిగట్టుకు వస్తే ఎవళ్ల పెద్దరికమన్నా చూడక్కర్లా? వీడు తాహతు ఉన్నవాడా ఐ. పి. రాయుడా అనన్నా గమనించ

కండా, గుర్రం గాడిదా ఏకం చేస్తే ఏమౌతుంది? ఎరగడు గావును ప్రజాప్రభుత్వమని !

ఒకటి రెండు సార్లు అరుణతో కూడా ప్రస్తావించాను ఆఫీసరు సంగతి. ఆయనేదో ధర్మరాజని నమ్ముతుంది పిచ్చిపిల్ల !

"ఆయన కేమండీ? తెలివైనవాడు, యోగ్యుడు, ఒకళ్లకు చాతైతే మంచి చేస్తాడు గాని చెడుచెయ్యడే ? అంత చిన్న వయస్సులోనే ఆఫీసరైనాడంటే ఎంతో సామర్థ్యముండాలా ? ఇతన్నెళ్లబట్టి చూస్తున్నాను, తన సంగతేమో తానేమో తప్ప యితరుల జోలికి పోడే ? ఆ అమాయకమైన కళ్లే చెబుతై అతని మంచితనాన్ని!"

"ఆపవోయి నీ అధిక ప్రసంగం! భట్రాజువై పోతున్నావేం మరీనీ?" తనను తిడుతున్నా పడవచ్చుగాని, భార్య తన ముందు పరపురుషుణ్ణి, అందులోనూ తాను ఈర్ష్యపడే వ్యక్తిని పొగుడుతుంటే సహించటం ఎంత సాత్వికుడికైనా పురుషుడికి తగనిపని!

"అదేమిటలా కోప్పడతారు ? మీ కాయనే మన్నా అపకారం చెయ్యలేదు గద!"

"అపకారమంటూ వేరే చెయ్యాలా ఏమిటి మనకు, తోటివాడికి ఉపకారం చేస్తే చాలదూ మనమాట లక్ష్యం చెయ్యకుండా!"

"అదా? మీమాట సుగ్రీవాజ్ఞగా చెలామణి కాలేదనా!"

నిండు సభలో జూదమాడిన యుధిష్ఠిరుడు కూడా అరుణతో వాగ్యుద్ధంలో ఓటమికి నేను పడ్డంత ఉద్రేకపడి వుండడు!

"ఆ రోజూ రాకపోదు, ఆఫీసరు భార్యవయ్యే యోగం త్వరలోనే పడుతుందిలే!!"

"నిజంగా?" నిర్ఘాంతపడ్డది అరుణ! ఆ నిమిషాన అరుణ మొహంమీద పరుగెడుతున్న ఆలోచనలకు అర్థం చెప్పలేనుగాని నేను మాత్రం నిశ్చింతగా మీసం దువ్వాను విజయగర్వంతో!

* * *

నలుగురు తలుచుకుంటే నిమిషం పట్టదు ఎంత గొప్ప వాణ్ణయినా ఫూల్ని చెయ్యటానికి! తానా బ్రహ్మచారి, ఇంట్లో నా అరుణకు నన్ను తప్పిస్తే రెండో లోడు లేదు! ఎవరన్నా విన్నా నమ్మేందుకు ఎంతన్నా అవకాశముంది! ఆఫీసరు దస్తూరితో అరుణపేర ప్రేమలేఖ బనాయించి మినిష్టరుకు చూపిస్తే, అరుణ దగ్గిర్నించి ఒక్క రిపోర్టుతో ఆఫీసరు గిఫీసరు ఆకాశంలోకి ఎగిరిపోతాడు ! ఆలోచన తట్టినందుకు నా బుర్రను నేనే ప్రశంశించుకున్నాను.

"అరూ !"

"ఓ !"

"ఒక్కమాట."

"ఏం కథ !"

విశ్వామిత్ర తపోభంగానికి నాకలోకం నుంచి దిగివచ్చిన మేనకలా సాక్షాత్కరించింది అరుణ సిగ్గుముఖాన్ని ప్రక్కకు తిప్పుకుని !

"బోలెడుంది! ఈ ఉత్తరం చూడు!" చేతి కందించాను సీరియస్‌గా. దెబ్బతిన్న లేడల్లే నిలువునా నీరైపోయింది అరుణ- ఉత్తరం చూస్తూనే! గొంతు వణికింది!

"క్షమించండి, ఎవరో కిట్టనివాళ్లు రాసి వుంటారు! ఆయన అలాంటివాడు కాదండీ! ఇన్నాళ్ళు మీతో కలిసిమెలిసి ఉన్న నన్ను మానిస్తున్నారా?" ఆడదాని ఏడిపించ గలగటం మగవాడి పౌరుషానికో గీటురాయి!

"ఎందు కేడుస్తావు! ఆ దస్తూరీ ఎవరిది?" గదమాయించాను.

కళ్ళు తుడుచుకుని ఉత్తరం పరకాయించి చూచి స్తంభించిపోయింది అరుణ!

"ఏందా నీ ఇన్వెస్టిగేషను!" ఆత్మప్రతిభను అభినందించుకున్నాను ఓర చూపుతో.

"ఆ రాత మనదే!"

ఒకసారి మొహం చిట్లించుకుని అంతలో చిరునవ్వు వెలిగించింది అరుణ.

"అమ్మ దొంగా! దేవాంతకులు?"

భరతనాట్య భంగిమలో ప్రేయసి లాలనగా జడతో కటాక్షించిన దెబ్బను అభినందించాలి గాని వీపు తడువుకో కూడదు!

అంతా ప్లాను ప్రకారం సిద్ధంచేశాను. టైపిస్టు అమ్మాయిలకు నలుగురికి నాలుగు కాగితాలు పారేసి కాస్త బతిమాలుకుని తమను ఆఫీసరు బలవంత పెడుతున్నట్టు ఒకరి తరవాత ఒకరుగా చెప్పించాను మినిష్టరుకు. పర్సనలుగా పదిమంది పెద్ద మనుష్యుల చేత ఆకాశరామన్న అర్జీలు పెట్టించాను. అగ్గికి గుగ్గిలం తోడైనట్టు

నా వుత్తరం చూపించాను. ఎంత సదభిప్రాయాన్నయినా ఇట్టే దురభిప్రాయంగా మారుస్తుంది పదిమంది మాట! మంత్రి ఉగ్రుడైపోయి వెంటనే పిలిపించాడు ఇంటర్వ్యూకు ఆఫీసరును.

మిన్ను విరిగి మీదపడుతున్నా తొణకని అతని రాజఠీవికి కొంచెం వొణికినా మళ్ళీ తమాయించుకున్నాను! కుర్చీ యిచ్చి కూచోమని ఉత్తరం చూపి-

“ఏమిటిది?” తీక్ష్ణంగా అడిగాడు మినిష్టరు ఆఫీసర్ని!

“వినాశకాలానికి విపరీత బుద్ధులు” ఓసారి నావంక నిశితంగా చూచి చిరునవ్వు నవ్వాడు ఆఫీసరు! “ఏమిటి నీ సమాధానం?”

“ఏమీ లేదు, నమస్తే, నేను వెళ్ళవచ్చునా?”

“నీ యిష్టం.”

“ఏమేం చెబుతాడోరా భగవంతుడా నా మీదన”ని గడగడ లాడిపోతున్న నా ప్రాణం ముభావంగా ఆయన వెళ్ళిపోవటంతో కొంచెం కుదట బడి మళ్ళీ చెవులు కొరకటం ప్రారంభించాను.

“చూచారా ఆ తలబిరుసుతనం!” అగ్నికి ఆజ్యంపోశాను, “యథార్థం తమరు గుర్తించే వుంటారు, అరుణను విచారించేందుకు పిలిపించమంటారా?” వినయము తొణికిన లాడింది నా కళ్ళలోనించి!

“అక్కర్లేదు, మీరు వెళ్ళండి.”

“చిత్తం. సెలవు!” కోటలో పాగా వేశామన్న మాటే యింకెందుకు?

ఆ రాత్రి జరిగిన సంగతంతా విని ఉబ్బిపోయింది అరుణ వెర్రి సన్నాసి! కౌను మరి! మొగుడికి ఉద్యోగంలో ప్రమోషన్ కంటె సంతోషవార్త మరోటుంటుందా ఆడదానికి?

“గుడ్ మార్నింగ్ ఆఫీసరుగారూ, కాఫీ రెడీ సార్!”

“చాల్లేవోయ్ వేళాకోళం!” ఆఫీసరు డిగ్నిటీని అనుకరించాను.

“అమ్మో! ఎంత హోదా ఆ కళ్ళల్లో!” కళ్ళు ముద్దెట్టుకుంది పిచ్చిపిల్ల!

ఆ రోజు అరుణ చేసిన వంట నలభీములకు రిఫ్రెషర్ కోర్సులు పెట్టించే టట్టుంది! భోజనానంతరం ఆకులు చిలుకలు చుట్టిస్తూ—

“ఆఫీసరన్న తరవాత నలుగురికంటే కొంచెం ముందువెళ్ళాలి. పని చూసుకుని పెందలాడే తిరిగి రండేం, ఉద్యోగపు సంబరంలో ఇంటి మాట మరిచిపోయేరు! జాకెట్టు జ్ఞాపకముంచుకోండి!”

“ఓ! దానికేం. ఆఫీసరు భార్యనైనాక జాకెట్టుకేం తక్కువ!” అరుణ కళ్ళు మళ్ళీ ఓ మారు ఆనందంతో తళుక్కుమన్నై. గుమ్మంలో నిలబడి చూపు అందేదాకా చెయ్యి వూపింది విజయం ఆకాంక్షిస్తూ!

ఆఫీసుకు వెళ్ళేసరికి కవరు సిద్ధంగా వుంది! వొణికే వేళ్ళను లక్ష్యం చెయ్యకుండా చించి చూసుకున్నాను.

“శ్రీ...ను గురించి రిపోర్టులు రావడం మూలాన అతన్ని రివర్టు చెయ్యటమైందనీ ఆ పోస్టుకు ఉత్తరువులు వచ్చేవరకూ శ్రీ——రి (అంటే నన్ను) చూస్తాడను”ని ఆర్డరు!

“మమ్మల్ని మరిచిపోకండేం?” ప్రక్కన నిలబడి ఆర్డరు చూస్తున్న టైపిస్టు గరల్ అందుకుంది తమలపాకులాంటి మెత్తని చేత్తో గోముగా నా మెడ నిమురుతూ.

“అలాగే లే, తప్పు! దూరంగా వుండు! నలుగురూ చూస్తే ఏమనుకుంటారు?” అథార్టీ చూయించాను అందుబాటులోకి వచ్చిన మొదటి జీవంమీద!

చార్జీ అప్పగిస్తూ కూడా అదే చిరునవ్వు! మతిచెడి వుంటుంది దౌర్భాగ్యుడికి!

తొందరగా పని ముగించుకుని ఆరవైమైళ్ళ స్పీడులో వొచ్చిదిగాను బంగళాముందు టాక్సీలో అరుణకు ఆర్డరు చూపిద్దామనే ఆత్రంతో! తలుపుతాళం పెట్టివుంది. సీతమ్మ పిన్నిగారింటికి వెళ్ళివుంటుంది అరుణ. వొట్టి తొందర! ఇంకా ఆర్డరు తాను చూడనే లేదు, అప్పుడే పసిగట్టాలీ వార్త జారెయ్యటానికి? ఇందుకే అంటారు ఆడవాళ్ళనోట్లో నువ్వుగింజ నానదని!

డూప్లికేటు చెవితో తాళంతీసి కోటు విప్పి స్టాండుకు తగిలించి మామూలు ప్రకారం నా కోసం ఫ్లాస్కులో వుంచిన కాఫీ తాగేసి టేబులు మీదున్న పత్రిక తీశాను కాలక్షేపానికి. అందులో ఏదో వుత్తరం! కుతూహలం కొద్దీ విప్పి చదివాను.

"ప్రియమైన......గారికి.

మీరు అహర్నిశలూ శ్రమపడి ఆఫీసరు పని సంపాదించినందుకు అభినందనాలు! కాని మీ స్వార్థంకోసం పడే పాకులాటలో పీసపాలు ఇతరులకోసం పడివుంటే మీ జీవితం యింకా ఆనందంగా వుండేదేమో! మీ ఫోర్జరీ ఉత్తరం వల్ల నాకు కనువిప్పు కలిగించినందులకు కృతజ్ఞతతో-

మీ అరుణ."

భూమి తిరుగుతున్నది! గ్రుస తిరుగుతున్నది! గంటకు వెయ్యిమైళ్ళ వేగంతో తిరుగుతున్నది!

# ప్రేమ పర్యవసానం

## అంగర వెంకట కృష్ణారావు

'నిక్షేపంలాంటి కృష్ణవిగ్రహం విరిగి ముక్కలైపోయిందండీ.'

అతడు తల వంచుకుని చదువుకుంటున్నాడు.

'క్రిందపడి తుబ్బెగుబ్బెలైపోయిందండీ.'

అతడు తలైనా యెత్తడంలేదు. విగ్రహం ఆమె చేతిలోంచి జారిపోవడం, పెద్ద శబ్దంతో క్రింద ముక్కలవడం ప్రక్కనే జరుగుతూంటే అతనెలా వినకుండా వుండగలుగుతాడు! విన్నాడు-అంతే.

'చూడమంటే చూడరేం... నా చేతులు విరిగిపోనూ...చక్కా ముద్దొస్తూండేది విగ్రహం... ఐనా యీ గోడకి కొట్టిపెట్టండని బతిమాలితే విన్నారా మీరు!...మిమ్మల్నే...చూడరేం!' అంటూ అతని తల బలవంతంగా పైకెత్తింది.

'అల్లరిచెయ్యకు రాధా' అన్నాడు విశ్వనాథం ముక్తసరిగా.

'నా కృష్ణవిగ్రహం విరిగిపోయిందండీ' అంది యేడుపుగా, గునుపుగా, ముద్దుగా, నవ్వుతాలుగా.

'ఆ విరిగిపోయిన ముక్కలన్నీ యెత్తి అవతల పారేయ్-లేకుంటే కాళ్ళకి గుచ్చుకుంటాయి.'

'వెళ్ళండి-అలాంటి సలహాలు చెప్పక్కర్లేదు-నాకూ తెలుసు విరిగిన బొమ్మ పారేయాలని.'

అతడు మళ్లీ తలవంచుకుని చదువ నారంభించాడు. మళ్లీ మొండిగా అతని తల యెత్తింది.

'మరొకటి కొనండీ...' అంది ఆ 'డీ'ని బాగా సాగదీస్తూ. ఆలోచన అన్యథా వున్నా చిరునవ్వు నవ్వక తప్పింది కాదు విశ్వనాథానికి.

'అది మట్టిబొమ్మ- అశాశ్వతమైనది. దాని మీద నీకంత మమకారం కూడదు. జీవితం అంతా యింతే- ఈ స్వల్పవిషయంలో అనంతమైన విశ్వరహస్యం సూక్ష్మరూపంలో గోచరిస్తూంది.'

అతడేదో వేదాంతం చెప్పుతూన్నంత సేపూ ఆమె ముఖంమీద అనేక రంగులూ, సీనులూ గబగబ మారిపోయేయి. విసుగుకుంటూ లేచి వెళ్ళిపోయింది. అతడు కొద్దిగా నవ్వుకొని తల వంచి తిరిగి చదువు ఆరంభించేడు.

రాధ కాపురానికి వచ్చి ఆరేళ్ళయింది. దంపతు లొకరినొకరు చాలా ప్రేమించుకుంటూరు. అతడిని విడిచి ఒక్క నిమిషం కూడా భరించలేదు రాధ. మానసికంగా, శారీరకంగా ఆమె యౌవనామృతం పొంగుతూన్న బంగారు కలశం. విశ్వనాథం కూడా మంచి రూపవంతుడే. కాని ఆసంగతి అతనికి తెలియదు. అతడెప్పుడూ స్వాప్నిక ప్రపంచవాసిలా గోచరిస్తాడు. ఈ దంపతుల తెన్నులో భూమ్యాకాశాంతరం వుంది.

ఆమె జీవితాన్ని ఒక అంటు మామిడిపండులా తిని వెయ్యాలని చూస్తుంది-అతడు ఒక తప్పనిసరి సన్నివేశంలా గడుపుతాడు - ఆమె సినిమాకి వెడితే టిష్యూచీర కట్టుకోవాలి, బుట్టచేతుల బ్లౌజు తొడుక్కోవాలి, ముక్కు పుడకతీసి బేసరి పెట్టుకోవాలి. అతడు సాధారణంగా సినిమాలకి వెళ్ళడు. ఎప్పుడైనా రాధ బలవంతం మీద వెడితే ఆట మొదలెట్టింది లగాయితు చివరవరకూ హాయిగా నిద్రపోతాడు. అంచేత రసవంతమైన ఘట్టాలు చూడక ఆమె ఆనందం పంచుకోలేదు. ఆమె అందుకు ఎంతో బాధ పడుతుంది.